క్లుప్తంగా

గోతిలో దిగబడిన ఇసుక లారీ

భామిని : మండలంలోని గురండి కూడలి వద్ద శుక్రవారం మధ్యాహ్నం ట్రాఫిక్ నిలిచిపోయింది. ఏబీ రోడ్డులోని గోతుల్లో ఒడిశా నుంచి వస్తున్న ఇసుక లారీ దిగబడిపోయింది. గురువారం కూడా ఇలానే గోతుల్లో లారీలు దిగబడిపోవడంతో ట్రాఫిక్ నిలిచిపోయి వాహనచోదకులు, ప్రజలు ఇబ్బంది పడ్డారు. శుక్రవారం కూడా అదే పరిస్థితి ఏర్పడడంతో వాహనచోదకులు అసహనం వ్యక్తం చేశారు. జేసీబీ తెచ్చి లారీని తీయాలని ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. దీంతో ఆర్టీసీ బస్సులను బిల్లుమడ వద్ద నిలిపివేశారు. భామిని, బత్తిలి నుంచి వచ్చిన విద్యార్థులు బస్సుల్లేక అవస్థలు పడ్డారు.

పెదంకలాంలో పారిశుద్ధ్య పనులు


పెదంకలాంలో జేసీబీతో పారిశుద్ధ్య పనులు

సీతానగరం: మండలంలోని ఫ్రైడే – డ్రైడే కార్యక్రమంలో భాగంగా ఈఓపీఆర్డీ కె.కుమారవర్మ ఆధ్వర్యంలో పెదంకలాం, తామరఖండి, పెదబోగిలి, సూరంపేట గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు జరిగాయి. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ జిల్లా ఉన్నతాధికారుల సూచనల మేరకు గ్రామాల్లో సర్పంచ్‌ల పర్యవేక్షణలో పంచాయతీ కార్యదర్శులు పారిశుద్ధ్య పనులు నిర్వహించడం, కాలువల్లో పూడికలు తీయించడం, క్లోరినేషన్ చేయించడం, పిచ్చిమొక్కల తొలగింపు తీసిన చెత్తకుప్పలను దూర ప్రాంతానికి తరలించడం జరుగుతుందన్నారు. ఈ నేపథ్యంలో పెదంకలాం పీహెచ్‌సీ ప్రాంగణం, మంచినీటి పథకం నీటి ఓవర్ హెడ్ చుట్టుపక్కలా శుద్ధి చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బలగ శ్రీనివాసరావు, కార్యదర్శులు, ఇంజినీరింగ్ సహాయకులు పాల్గొన్నారు.

గిరి విద్యార్థుల్లో ఆందోళన

పార్వతీపురం టౌన్: ఏకలవ్య పాఠశాలలో హిందీ మాధ్యమంతో బోధన వల్ల గిరి విద్యార్థుల్లో ఆందోళన నెలకొందని గిరిజన సంక్షేమ సంఘం నాయకుడు పాలక రంజిత్ అన్నారు. ఈ మేరకు ఐటీడీఏ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్వతీపురం మన్యం జిల్లాలో గుమ్మలక్ష్మీపురం, కురుపాం, అనసభద్ర, కొటికిపెంట ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో ఇటీవల నూతన ఉపాధ్యాయులు నార్త్ ఇండియా నుంచి వచ్చారని, వారు హిందీ మాధ్యమంలో బోధించడంతో గిరిజన విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గతంలో ఇంగ్లిష్, తెలుగులో బోధించే వారు ఇప్పుడు సైన్స్, సోషల్, ఇంగ్లిష్, లెక్కలు సైతం హిందీలోనే బోధన జరుగుతుందన్నారు. ప్రస్తుతం 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు మరింత ఆందోళన చెందుతున్నారన్నారు. హిందీ తప్ప మరే ఇతర భాషలు రావటం లేదని ఏకలవ్య పాఠశాలలో పరిస్థితులు చక్కబడే వరకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలలన్నారు. ఈ పాఠశాలలపై సమీక్ష జరపాలని, గిరిజన విద్య కాపాడాలని కోరారు.

మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ


మొక్కలు నాటుతున్న మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు

రాజాం సిటీ: మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు అన్నారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం ఆవరణలో వికాస తరంగిణి ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం శుక్రవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజాంను పచ్చరాజాంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ ఖాళీ ప్రదేశాల్లో, ఇంటి ఆవరణల్లో మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. మొక్కలు నాటడమే కాకుండా నాటిన మొక్కలను సంరక్షించే బాధ్యతలు కూడా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు ఎస్.కె.రాజు, ఎంపీడీవో వి.శ్రీనివాసరావు, ఐసీడీఎస్ పీవో కనకదుర్గ, వికాస తరంగిణి సెంట్రల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి రమణమూర్తి, ఏపీవో కె.సాయిరాం పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం


ప్రచారంలో ఇందూ జ్ఞాన వేదిక ప్రబోధ సేవా సమితి సభ్యులు

రేగిడి: మండలంలోని సంకిలి, చిన్నయ్యపేట, బొడ్డవలస గ్రామాల్లో శ్రీకాకుళం జిల్లాకు చెందిన త్రైత సిద్ధాంత భగవద్గీత ఇందూ జ్ఞాన వేదిక ప్రబోధ సేవా సమితి సభ్యుడు సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం శుక్రవారం నిర్వహించారు.

● హెల్మెట్ తప్పనిసరి



ద్విచక్ర వాహనదారులంతా తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఏఎస్ఐ ఏఈ రమణ సూచించారు. మండల కేంద్రంలో పారా లీగల్ వలంటీర్ అందవపు కోటేశ్వరరావు ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు శుక్రవారం నిర్వహించారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబధనలు పాటించాలని, మద్యం తాగి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపవద్దని, వాహనాలతో బయటకు వచ్చేటప్పుడు లైసెన్స్‌తో పాటు వాహన ధ్రువపత్రాలన్నీ వెంట తీసుకురావాలని అన్నారు. – కురుపాం



రథయాత్ర ఉత్సవాల్లో భాగంగా జగన్నాథస్వామి శుక్రవారం వామనావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అర్చకుడు విశ్వనాథం దాస్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఇబ్బందుల్లేకుండా ఈఓ సర్వేశ్వరరావు ఏర్పాట్లు చేశారు. ఎస్సై ప్రశాంత్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఏర్పాట్లు చేపట్టారు. పరిశర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. -పాలకొండ

● హుండీల ఆదాయం లెక్కింపు



తోటపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ హుండీల్లో భక్తుల కానుకల రూపంలో చేరిన ఆదాయాన్ని శుక్రవారం లెక్కించారు. ఆలయ ఈవో ఎం.ప్రసాద్ సమక్షంలో జరిగిన ఈ లెక్కింపులో మొత్తం రూ.4.16 లక్షల 205 రూపాయలు లభించినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి వి.వి.సూర్యనారాయణ తెలిపారు. కోదండరామ ఆలయ హుండీల ఆదాయం రూ.8,645 సమకూరిందన్నారు. 28 మార్చి నుంచి 12 జూలై వరకు హుండీల్లో భక్తులు వేసిన కానుకలు లెక్కించామన్నారు. కార్యక్రమంలో దేవస్థానం అభివృద్ధి కమిటీ సభ్యులు డి.ధనుంజయరావు, ఎం.వాసునాయుడు, ఎం.ప్రకాష్, శ్రీరామ చంద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు. -గరుగుబిల్లి

కండ్లకలక నివారణపై అవగాహన


కండ్లకలక వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న నేత్ర వైద్యాధికారి నగేష్‌రెడ్డి

కురుపాం: స్థానిక సీహెచ్‌సీలో శుక్రవారం నిర్వహించిన నేత్ర వైద్యశిబిరంలో కండ్లకలక వ్యాధి నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా అంధత్వ నివారణ సంస్థ నేత్ర వైద్యాధికారి నగేష్‌రెడ్డి ఆ వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలను వివరించారు. అంతకుముందు శిబిరానికి విచ్చేసిన 38 మందికి నేత్ర వైద్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి కళ్లద్దాల కోసం సిఫారసు చేశారు. కార్యక్రమంలో నేత్ర వైద్య సహాయకులు రమేష్, మాలిక, శిరీష తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణాలు చేపట్టేలా చైతన్యపరచండి


మాట్లాడుతున్న ఏఈ, మేనేజర్, తదితరులు

పాలకొండ రూరల్: ప్రభుత్వం ద్వారా సక్రమించిన ఇళ్ల స్థలాల్లో నిర్మాణాలు చేపట్టేలా లబ్ధిదారులను చైతన్యపరచాలని గృహనిర్మాణ శాఖ ఏఈ మాధవరావు, నగర పంచాయతీ మేనేజర్ టి.జయరామ్ అన్నారు. పట్టణ పరిధిలోని సచివాలయ సిబ్బందితో శుక్రవారం స్థానిక నగర కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈ మాధవరావు మాట్లాడుతూ, లుంబూరు రహదారిలో గల అర్బన్ కాలనీలో వంద రోజుల్లో ఐదు వందల గృహనిర్మాణాల్లో సంపూర్ణ పురోగతి వచ్చేలా లక్ష్యాలను నిర్దేశించుకోవాలని సూచించారు. త్వరితగతిన నిర్మాణాలు పూర్తయ్యేలా చూడాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గరుగుబిల్లి: మండలంలోని రావుపల్లి, దళాయివలస, ఉద్దవోలు, బురద వెంకటాపురం, చినగుడబ, ఎస్.ఆర్.పేట, పెదగుడబ, కొత్తపల్లి, కొత్తూరు, గొట్టివలస, పెద్దూరు, గరుగుబిల్లి గ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ కిశోర్‌కుమార్ ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. సబ్‌స్టేషన్‌లోని 33 కేవీ విద్యుత్ లైన్ నిర్వహణ పనుల కారణంగా ఉదయం 7.30 గంటల నుంచి 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

భామిని: మండలంలోని కొరమ ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల నిర్వహణ, జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టనున్న నేపథ్యంలో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. పనుల అనంతరం సరఫరాను పునరుద్ధరిస్తామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

సీతంపేట: మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ పరిధిలో మెయింటెనెన్స్ పనులు చేపట్టనున్న నేపథ్యంలో శనివారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం మూడు వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ గోపాలకృష్ణ, ఈఈ నీలిమ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నూతన కార్యవర్గం ఎన్నిక


ఎన్నిక నిర్వహిస్తున్న ఏపీఎం నాగభూషణరావు

జియ్యమ్మవలస: స్థానిక వెలుగు కార్యాలయంలో మహిళా మండల సమాఖ్య నూతన కార్యవర్గం ఎన్నిక శుక్రవారం జరిగింది. అధ్యక్షురాలిగా పల్లి రాజేశ్వరి, ఉపాధ్యక్షురాలిగా ఊయక పావని, కార్యదర్శిగా గుణుపూరు పార్వతి, కోశాధికారిగా పొదిలాపు మంగమ్మ, సంయుక్త కార్యదర్శిగా జోగి మంగమ్మ ఎన్నికైనట్లు ఏపీఎం నాగభూషణరావు తెలిపారు.

మెరుగైన బోధన అందించాలి

పాలకొండ రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో మరింత మెరుగైన బోధన అందించాలని మండల విద్యాశాఖాధికారి కె.సోంబాబు అన్నారు.

శుక్రవారం స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల కేంద్రంగా మండల పరిధిలో పాఠశాలలకు అందిస్తున్న పుస్తకాల పంపిణీని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పుస్తకాల సేకరణకు వచ్చిన హెచ్ఎంలు, ఉపాధ్యాయులతో మాట్లాడుతూ, ప్రభుత్వం సమకూరుస్తున్న వనరులను సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. ప్రస్తుత సీజన్‌లో విద్యార్థుల ఆరోగ్య భద్రతపై శ్రద్ధ వహించాలన్నారు.

మహిళలను గౌరవించాలి

రాజాం సిటీ: ప్రతి ఒక్కరూ మహిళలను గౌరవించాలని ఐసీడీఎస్ పీవో కె.కనకదుర్గ కోరారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో మహిళల హక్కులు, చట్టాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. పురుషులతో సమానంగా మహిళలు రాణిస్తున్నారని, అలాంటి వారు కొన్నిచోట్ల నిర్లక్ష్యానికి గురవుతున్నారన్నారు. పనిచేసే చోట మహిళలు లైంగిక వేధింపులకు గురవుతుండడం బాధాకరమన్నారు.

భవనాలు ప్రారంభం


భవన సముదాయ శిలాఫలకం ఆవిష్కరిస్తున్న సంస్థ ప్రతినిధులు

భామిని : గ్రామీణ ప్రజల అవసరాలు తీర్చడం కోసం మండలంలోని ఘనసర కాలనీలో నిర్మించిన ఫ్రీ ట్యూషన్ సెంటర్, లేడీస్ టైలరింగ్ సెంటర్, కంప్యూటర్ సెంటర్ భవనాలను మిత్ర దాతు నిగమ్ లిమిటెడ్ ప్రతినిధులు శుక్రవారం ప్రారంభించారు. అనంతరం గ్రామీణవికాస్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆర్ఓ వాటర్‌ప్లాంట్, స్టడీ సెంటర్‌ను సందర్శించారు. కార్యక్రమంలో ఎన్.గౌరీశంకరరావు, వల్లూరి చక్రపాణి, వెల్లంకి హరికృష్ణ, డీవీ రమణమూర్తి, డాక్టర్ మజ్జి ఈశ్వరరావు, అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు


ఎరువుల నిల్వలను, విక్రయ రికార్డులను పరిశీలిస్తున్న ఏఓ అవినాష్

సీతానగరం: మండలంలోని ఖరీఫ్ సీజనులో రైతుల అవసరాలకు అనుగుణంగా ఎరువులు అందుబాటులో ఉండేలా డీలర్లు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని ఏఓ ఎస్.అవినాష్ అన్నారు. బూర్జనాయుడు ఫెర్టిలైజర్స్, విజయరామ ఫెర్టిలైజర్స్, డిపోలను ఆయన శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల అవసరాల దృష్ట్యా రైతులకు అధిక ధరలకు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. అదే విధంగా ఎరువుల కొనుగోలు చేసిన రైతులందరికీ విధిగా రసీదులు ఇవ్వాలని, రైతులు పొందాలని, ఎరువులు లభ్యతను డిపోల వద్ద ధరల పట్టిక, నిల్వలు, విక్రయ వివరాల పట్టికను ప్రదర్శించాలని ఆదేశించారు. ఎరువుల దస్త్రాలను పరిశీలించి నిల్వల రికార్డులు విధిగా అందుబాటులో ఉంచాలని, తనిఖీ చేసే అధికారులకు కనిపించే విధంగా ఉంచాలని సూచించారు.

బాధితులకు న్యాయం జరిగేలా వాదనలు

● న్యాయమూర్తి విజయ్ రాజ్‌కుమార్


న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి విజయ్ రాజ్‌కుమార్

పాలకొండ రూరల్: బాధితులకు న్యాయం జరిగేలా వాదనలు వినిపించాలని స్థానిక సివిల్ కోర్టు న్యాయమూర్తి ఎ. విజయ్ రాజ్‌కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక న్యాయస్థానం ఆవరణలో లీగల్ అవేర్‌నెస్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా తాజాగా అమల్లోకి వచ్చిన నూతన చట్టాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా రోడ్డు భద్రత, రహదారి ప్రమాదాలను అధిగమించే క్రమంలో వాహనచోదకులు అనుసరించాల్సిన నిబంధనలు, నిర్లక్ష్యంగా వాహనాలు నడిపి ప్రమాదాలకు కారకులయ్యేవారికి నూతన చట్టాల ద్వారా పడే శిక్షలను వివరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలి


కార్మికులతో సమావేశమైన రమణారావు

పాలకొండ: భవన నిర్మాణ కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు కోరారు. మండల కేంద్రంలో భవన నిర్మాణ కార్మికులతో శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని కోరారు. అనంతరం భవన నిర్మాణ కార్మికుల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

దరఖాస్తుల స్వీకరణ


కౌలు రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

పాలకొండ రూరల్: కౌలురైతుల గుర్తింపునకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ పి.సన్యాసిరావు అన్నారు. పట్టణ పరిధిలోని పెద్దకాపువీధి సాయిమందిరంలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించి, కౌలురైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కౌలురైతుగా గుర్తింపు పొందేందుకు సదరు రైతు వారు కౌలుకు సేద్యం చేస్తున్న భూయజమాని ఆధార్, వన్ బీ, దరఖాస్తుపై యజమాని సంతకం, పాస్‌ఫోటో, ఫోన్ నంబర్ తీసుకురావాలన్నారు. కౌలురైతు గుర్తింపు కార్డుల ద్వారా ప్రభుత్వ పరమైన సంక్షేమ రాయితీలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో వీఆర్వో బలివాడ సాయి, పట్టణ వ్యవసాయ సహాయకుడు సాయి మహేష్, భూ యజమానులు, కౌలు రైతులు పాల్గొన్నారు.

రుణఅర్హత కార్డులతో ప్రయోజనాలు..

వీరఘట్టం: రుణఅర్హత కార్డులతో కౌలురైతులకు ఎన్నో ప్రయోజనాలు చేకూరుతాయని ఆర్ఐ లక్ష్మన్నాయుడు అన్నారు. మండలంలోని బొడ్లపాడు, రేగులపాడు, కొంచ, హుస్సేనుపురం, కత్తులకవిటి, ఎం.రాజపురం, కుంబిడి, చిట్టపులివలస, విక్రమపురం, శ్రీహరిపురం, మొదటి కెల్ల, కడకెల్ల, నడిమికెల్ల, కంబర రెవెన్యూ గ్రామాల్లో సభలు నిర్వహించి కౌలురైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు.

హిందీలో బోధనతో ఇబ్బందులు

గుమ్మలక్ష్మీపురం: కురుపాం, గుమ్మలక్ష్మీపురం, అనసభద్ర, కొటికిపెంట గ్రామాల్లోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో హిందీ మాధ్యమంలో విద్యాబోధన చేయడంతో అక్కడి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయగా, చాలా మంది ఉత్తర భారతదేశం నుంచి వచ్చిన వారే ఉపాధ్యాయులుగా వచ్చి, చేరారు. దీంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర అధ్యక్ష, కార్యదర్శులు తాడంగి సాయిబాబు, పాలక రంజిత్‌కుమార్ అన్నారు. గతంలో తెలుగు, ఇంగ్లిష్ మాధ్యమాల్లో విద్యాబోధన చేయడంతో చక్కగా అర్థమయ్యేదని, ఇప్పుడు కొత్తగా వచ్చిన సిబ్బంది చేసే హిందీలో బోధనతో ఏమీ అర్థం కావడం లేదని పలువురు విద్యార్థులు వాపోతున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రత్యామ్నాయ మార్గాలు ఆలోచించి, విద్యార్థులకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.

చురుగ్గా పారిశుద్ధ్య పనులు


గరుగుబిల్లిలో కాలువల్లోని పూడికలు తొలగించి, తొలగిస్తున్న దృశ్యం

గరుగుబిల్లి: మండలంలోని గరుగుబిల్లి, పెద్దూరు, నాగూరు, దళాయివలస, ఉల్లిబద్ర, రావుపల్లి, బీవీపురం, ఉద్దవోలు, గొట్టివలస గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చాలా చురుగ్గా కొనసాగుతున్నాయి. శుక్రవారం డ్రైడే పాటించి, కాలువల్లోని మురుగుతో పాటు పరిసరాల్లోని అనవసర నీటి నిల్వలను పారబోశారు. కొబ్బరిబోండాలు, టైర్లు, టబ్బుల్లో ఎక్కువ కాలం నిల్వ ఉన్న నీటి ద్వారా దోమలు పెరిగే అవకాశం ఉందని, దోమల ద్వారా మలేరియా, డెంగీ వంటి విషజ్వరాలు ప్రబలుతాయన్నారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత కూడా పాటించాలన్నారు. ఎంపీడీవో పి.సూర్యనారాయణ, ఈవోపీఆర్డీ ఎల్.గోపాలరావులు డ్రైడే నిర్వహణను పరిశీలించి, పలు సూచనలు చేశారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత కూడా పాటించి, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి తోడ్పడాలని కోరారు.

చురుగ్గా పారిశుధ్య పనులు


గుమ్మలక్ష్మీపురం: సీమలగూడలో ఫాగింగ్ చేస్తున్న సిబ్బంది

గుమ్మలక్ష్మీపురం: ప్రత్యేక పారిశుధ్య నిర్వహణలో భాగంగా మండలంలోని కేదారిపురం పంచాయతీ పరిధిలో ఉన్న ఆరు గ్రామాల్లో దోమల నివారణకు ఫాగింగ్ చర్యలు చేపట్టారు. అలాగే దోమలు వృద్ధి చెందకుండా అనవసర నీటి నిల్వలను బయట పారబోశారు. కార్యక్రమంలో సర్పంచ్ తాడంగి తులసమ్మ, పంచాయతీ కార్యదర్శి బి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటిస్తే
చెరకులో అధిక దిగుబడులు


బుద్దిపేటలో గొలుసుకట్టుతో ఉన్న చెరకు పంట

సీతానగరం: మండలంలో నీటివనరులున్న రైతులు 2024 – 25 క్రషింగ్ సీజన్‌లో పండిస్తున్న చెరకు పంటను గాలికి నేలకు పడిపోకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టవలసిన అవసరం ఉంది. ఈ ప్రాంత రైతులు దశాబ్దాల కాలంగా చెరకు పంటను వాణిజ్య పంటగా గుర్తించి సాగు చేస్తున్న కారణంగా మమ్ము చెరకు 2500 ఎకరాలు, మొక్క చెరకు(ప్లాంటేషన్)పంట 2 వేల ఎకరాల విస్తీర్ణంలో చెరకు సాగు చేస్తున్నారు. మళ్ళలో చెరకు ఏపుగా పెరడం వలన గాలికి నేలకొరిగితే చెరకు పంట దిగుబడి తగ్గుతుందని రైతుల అనుభవం చెబుతుంది. ఈ ఏడాది చెరకు సాగుకు వాతావరణం అనుకూలించడంతో పొడవుగా పెరగడంతో ఈదురుగాలితో కూడిన వర్షాలు కురుస్తున్నందున నేలమట్టం కావడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఏపుగా పెరిగిన చెరకు తోటకు రక్షణగా రైతులు చెరకు పొదులను నాలుగు దిక్కులా సేకరించే చెరకు కర్రలను గుద్దాం కట్టుకట్టడం, తారెల్లో ఉన్న చెరకు కర్రలను కలిపిన చెరకు కర్రలను గొలుసు కట్టు విధానం ద్వారా చెరకు నేలమట్టం కాకుండా రక్షించుకోడానికి రైతులు చర్యలు చేపట్టాల్సి ఉంది. చెరకు పంటలో బోదెల మధ్య చెరకు పొదుల్లో ఇప్పటికే ఎరువులు వేయడం, కలుపు తీయడం ఎప్పటికప్పుడు చేస్తున్నందున చెరకు పొడవుగా పెగడంతో రైతులు ముందు జాగ్రత్త చర్యలు చేపడుతున్నారు. అయినా ఈదురుగాలికి తట్టుకోలేని మళ్ళలో చెరకు తోట పడిపోవడం ముచ్చలున్న(కణుపులు)దగ్గర వేళ్ల రావడంతో రైతులు మరింత జాగ్రత్తలు చేపడుతున్నారు.


వెంకటాపురంలో గుద్దాం కట్టుతో ఉన్న చెరకు పంట

జాగ్రత్తలు వివరిస్తున్నాం

మండలంలో నీటి వనరులున్న గ్రామాల రైతులు చెరకు పంటను కార్శిలననురించి చెరకు ప్లాంటేషన్ వేయడం జరుగుతుంది. అందుకు అవసరమైన ఎరువులు సకాలంలో వేయడంతో చెరకు తోటలు ఏపుగా పెరగడంతో చెరకు దిగుబడి పెరుగుతుంది. ఇంకా పెరగడానికి వీలుగా చెరకు పంట పడిపోకుండా గొలుసు విధానంతో కట్టడం, గుద్దాం కట్టులు వేయడం జరుగుతుంది. ఎక్కడా చెరకు పంట నష్టం వాటిల్లకుండా రైతులు జాగ్రత్తలు పడుతున్నారు. ఏపుగా పెరుగుతున్న చెరకు తోటకు గాలి, వెలుతురు, నీరు సమృద్ధిగా ఉండే విధంగా రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

– ఎస్.అవినాష్, ఏఓ, సీతానగరం

ఆరోగ్యమే మహాభాగ్యం

రేగిడి: ఆరోగ్యమే మహాభాగ్యమని ఐసీడీఎస్ రేగిడి సెక్టార్ సూపర్‌వైజర్ శశికళ అన్నారు. మండలంలోని ఆమదాలవలస, రేగిడి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార ప్రదర్శన శుక్రవారం నిర్వహించారు. అనంతరం పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు.